గుడిసెల్లో మగ్గాల్సిందేనా?


బుడగజంగాల కోసం నిర్మించిన డబుల్‌బెడ్‌రూంలు


డబుల్‌బెడ్‌రూంల పక్కన గుడిసెలు

- 'డబుల్' ఇళ్లకోసం ఏళ్లుగా తప్పని ఎదురుచూపులు
- ఇబ్బందులు పడుతున్న బుడగజంగాల కుటుంబాలు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటి పరిధిలోని 4వవార్డులో నిర్మాణంలో ఉన్న 96 డబుల్‌బెడ్‌రూం ఇళ్లు పూర్తికాకపోవటంతో బుడగజంగాల కుటుంబాలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏళ్లుగా ఇళ్ల కోసం ఎదురుచూస్తూ.. పక్కనే గుడిసెలు వేసుకొని వాటిల్లో మగ్గిపోతున్నారు. ఇందులో పదిమంది వరకు తమ కల నెరవేరకముందే కన్నుమూశారు. మిగతావారు సైతం తమ కల నెరవేరుతుందోలేదోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా..

పట్టణంలో ఉన్న 96 బుడగజంగాల కుటుంబాలకు అప్పటి సీఎం వైఎస్‌రాజశేఖరరెడ్డి హయాంలో నాటి ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డి ఇళ్లస్థలాలు మంజూరు చేయించారు. అందుకు సంబంధించిన పట్టాలు అందజేశారు. ఆ తరువాత రాజకీయ సమీకరణల నేపథ్యంలో వారు ఇందిరమ్మ ఇళ్లకు నోచుకోలేదు. ఈ క్రమంలో 65 మంది అనేక కష్టాలు పడి తమకు కేటాయించిన స్థలంలో ఒక్కొక్కరు రూ. లక్ష వరకు వెచ్చించి పునాదులు నిర్మించుకున్నారు. కాగా 2014లో తెలంగాణ ఏర్పాటయ్యాక డా.లక్ష్మారెడ్డి మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూం ఇళ్లనిర్మాణం ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఈ క్రమంలో పట్టణంలో బుడగజంగాలకు కేటాయించిన స్థలంలో ప్రభుత్వం 96 డబుల్‌బెడ్‌రూంలు నిర్మించతలపెట్టింది. స్వయంగా మంత్రిగా ఉన్న లక్ష్మారెడ్డి భరోసా ఇవ్వటంతో బుడగజంగాలు అంగీకరించి తాము పునాదులు నిర్మించుకున్నప్పటికీ వాటిని తొలగించేందుకు అంగీకరించారు. దీంతో అన్నింటినీ జేసీబీల సాయం తీసివేసి ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. కానీ నిర్మాణం 80శాతం పూర్తయ్యేసరికి కాంట్రాక్టరుకు బిల్లు గిట్టుబాటు కాకపోవటంతో అక్కడినుంచి నిష్క్రమించారు. నాలుగేళ్లుగా డబుల్‌బెడ్‌రూంలు అసంపూర్తిగానే ఉండిపోయాయి. ఇప్పుడూ.. అప్పుడూ అంటూ అధికారులు సైతం కాలయాపన చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం మారగా ఇప్పుడైనా పూర్తిచేసి ఇస్తారో.. ఇంకేమైనా చేస్తారోనని బుడగజంగాలు ఆందోళన చెందుతున్నారు. సొంత ఇళ్లు లేనందున నిర్మాణ ప్రాంతంలో ఖాళీ స్థలంలో గుడిసెలు వేసుకుని నానా అవస్థలు పడుతూ కాలం వెల్లదీస్తున్నారు. ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్నవారిలో పదిమంది వరకు కల నెరవేరక ముందే కన్నుమూశారు. కాగా మిగిలిన వారు ఇప్పటికైనా తమ కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

కష్టాలు పడుతున్నాం

ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడు.. మాకు ఇళ్లపట్టాలు ఇచ్చారు. ఎలాగోలా ఇళ్లకట్టుకుందామని రూ.లక్ష ఖర్చుచేసి పునాది కట్టుకున్నాం. అయితే డబుల్‌బెడ్‌రూంలు కట్టిస్తామని అప్పటి మంత్రి లక్ష్మారెడ్డి మా అందరికీ నచ్చచెబితే.. పునాదులు కూల్చేయడానికి ఒప్పుకున్నాం. ఇళ్ల నిర్మాణం ఇప్పటికీ పూర్తి చేసి ఇవ్వలేదు. ఇళ్లకోసం ఎదురుచూసి కొందరు కల నెరవేరకముందే కన్నుమూశారు. ఇప్పటికైనా ప్రభుత్వం న్యాయం చేయాలి.

– బుడగజంగం కళమ్మ, జడ్చర్ల

చర్యలు చేపడతాం

జడ్చర్ల మండలంలో ఉన్న అన్ని డబుల్‌బెడ్‌రూంలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ జరుగుతుంది. అనంతరం మిగిలిన పనులు పూర్తిచేసేందుకు చర్యలు చేపడతాం. బుడగజంగాల వారికోసం నిర్మించిన డబుల్‌బెడ్‌రూంల గురించి తెలుసుకుని అధికారులకు వివరించి ఎలా పూర్తిచేయాలో నిర్ణయం తీసుకుంటాం. పూర్తిచేయించాక అర్హులైన వారికి ఇళ్లు కేటాయింపు చేస్తాం.

–జేఆర్‌ఎస్ కుమార్, ఏఈ, హౌజింగ్, జడ్చర్ల

క్లుప్తంగా

తీగలపల్లిలో వైద్య శిబిరం



నవాబుపేట: మండల పరిధిలోని తీగలపల్లి గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ శ్రీధర్‌రెడ్డి బృందంతో కార్యక్రమం చేపట్టారు. శిబిరాన్ని డీసీసీ జిల్లా ప్రధానకార్యదర్శి బంగ్లరవి ప్రారంభించారు. శిబిరం ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, ఆశన్న, రమేష్‌గౌడ్, నర్సింహులు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు

మహబూబ్‌నగర్ క్రీడలు: కొత్తగూడెంలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను ఆదివారం జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి జి.శరత్‌చంద్ర తదితరులు అభినందించారు. పతకాలు సాధించిన వారిలో అంకుర్ జీవన్ (రజత పతకం), బ్రిందయాదవ్ (కాంస్య పతకం) తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు ఆనంద్, సునీల్, సాధిక్‌అలీ, ఎం.శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శి సి.శ్రీనివాసులు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐకి సన్మానం

అడ్డాకుల: మూసాపేట ఎస్‌ఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కె.సుజాతను ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పోలీస్ స్టేషన్‌లో కలిశారు. శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహ యాదవ్, చంద్రశేఖర్, నర్సిములుగౌడ్, కృపాకర్‌రెడ్డి, రఘురాములు, లక్ష్మణ్, కాశీనాథ్, రాజు, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఘంటసాలకు ఘననివాళి



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని కళాకారులు ఆదివారం ఘంటసాల వర్ధంతి ృనిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కె.రాములు, ఘంటసాల సాంస్కృతిక సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.హరిప్రసాద్, శ్రీమిత్ర కళానాట్య మండలి ప్రధాన కార్యదర్శి వి.నారాయణ, కళాకారులు ఎస్.నర్సిములు, రామకళ, యాదయ్య, కె.లక్ష్మణ్, విజయకుమార్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సమాజ్ క్యాలెండర్ ఆవిష్కరణ



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాగూర్ మీద బీసీ సమాజ్ ముద్రించిన క్యాలెండర్‌ను మాజీ మంత్రి ఈటల రాజేందర్ ఆవిష్కరించారు. ఆదివారం ఆయన స్వగృహంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ భారతదేశంలో బీసీలకు, ఎంబీసీలకు, మహిళలకు, ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడంలో ముఖ్య భూమిక పోషించాడని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని సిఫారసు చేసిన ముంగేరి లాల్ కమిషన్ నివేదికను అమలు చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని పార్టీలో వ్యతిరేకతను కూడా మూట గట్టుకున్నాడన్నారు. కార్యక్రమంలో బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యారావు, బీసీ సమాజ్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సతీష్, జాతీయ ఎంబీసీ నాయకుడు వెంకటేష్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఆశన్న ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దీన్‌దయాల్ అడుగుజాడల్లో నడవాలి

నారాయణపేట రూరల్: జనసంఘ్ వ్యవస్థాపకుడు దీన్‌దయాల్ ఉపాధ్యాయ అడుగుజాడల్లో ప్రతి కార్యకర్త నడిచి ఆదర్శంగా నిలవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యాయాదవ్ అన్నారు. ఆదివారం బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో దీన్‌దయాల్ వర్ధంతి నిర్వహించారు. ఈ మేరకు.. దీన్‌దయాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. దీన్‌దయాల్ ఆశయసాధనకు ప్రధాని మోదీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి ప్రతి కార్యకర్త కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో గోపాల్, రాము, శ్రీనివాస్, మోహన్, మొగలప్ప పాల్గొన్నారు.



ఉర్దూ ఘర్ పునర్ నిర్మాణం చేపట్టండి


ఉర్దూఘర్‌ను పరిశీలిస్తున్న ముస్లిం సంఘాల నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: సమైక్య రాష్ట్రంలో నిర్మించిన ఉర్దూఘర్ శిథిలావస్థకు చేరినా గత పాలకులు పట్టించుకోలేదని, దీనిని పునర్‌నిర్మాణం చేపట్టాలని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్, ఈమాన్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ సలీం కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఉర్దూ ఘర్‌ను వివిధ ముస్లిం ప్రజాసంఘాల నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని నడిబొడ్డున ఉన్న ఉర్దూ ఘర్ శిథిలావస్థకు చేరడంతో ముస్లిం సమావేశాలు చేసుకోవడానికి కష్టంగా ఉందన్నారు. పేద ముస్లింల వివాహాల కోసం కన్వెన్షన్ హాల్ నిర్మించడానికి ప్రభుత్వం చొరవ చూపాలని, ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే వీటి నిర్మాణానికి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అనంతరం సంఘాల నాయకులు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆల్‌మేవా జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ అయూబ్, మహ్మద్ ఉమర్ ఫారుఖ్, నిజాముద్దీన్, జావెద్, అబ్దుల్లా సున్నీ, ఇమ్రాన్‌ఖాన్, ఎం.ఎ.ముఖీద్, నదీం, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ చెంత భక్తుల సందడి



నవాబుపేట: మండల పరిధిలోని పర్వతాపూర్ మైసమ్మ చెంత ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవురోజు కావటంతో ప్రజలు మైసమ్మ అమ్మవారికి మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు చేశారు. అడవి మొత్తం భక్తులతో నిండి అమ్మవారి నామస్మరణ మార్మోగింది.

అందరి సుభిక్షం కోసమే పాదయాత్ర


కందూర్‌లో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

అడ్డాకుల: సకల మానవాళి సుభిక్షంగా ఉండాలనే మహా పాదయాత్ర చేపట్టినట్లు సంకల్పదీక్షా పారాయణులు, ప్రధాన అర్చకులు గట్టు రంగాచార్యులు పేర్కొన్నారు. మండలంలోని కందూర్ గ్రామంలో ఆదివారం గడప గడపకు గోవు, గోవిందుడు, గీత నినాదంతో చేపట్టిన శ్రీవారి తిరుమల మహా పాదయాత్ర 22వ రోజు కందూర్‌కు చేరుకుంది. లక్ష్యసాధన ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుపతిగారి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో తిరుమలకు చేపట్టిన యాత్రలో భాగంగా గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. మేళతాళాలతో పాదయాత్రకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని ప్రధాన కూడలిలో రాత్రి శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. సకల మానవాళి సంతోషంగా ఉండాలనే గ్రామాల్లో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణాలను నిర్వహిస్తున్నట్లు ప్రధాన అర్చకులు గట్టు రంగాచార్యులు తెలిపారు.

బాలస్వామికి అవార్డు



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): విశ్వగురు వరల్డ్ రికార్డు అవార్డును జిల్లా కేంద్రానికి చెందిన సీపీఎస్‌ఉద్యోగ సంఘం అధ్యక్షుడు సనాతన బాలస్వామి అందుకున్నారు. విశ్వగురు వరల్డ్ రికార్డు సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో కార్యక్రమం జరిగింది. సంస్థ వ్యవస్థాపకుడు సత్యవోలు రాంబాబు అవార్డు అందజేశారు.

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు

కోస్గి: వాసవీ మాత ఆత్మార్పాణ దినం సందర్భంగా ఆదివారం మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కోస్గిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక లక్ష్మీవేంకటేశ్వర శివసాయి అయ్యప్ప ఆలయాల్లోని ఇంద్రనీలేశ్వర ఆలయంలో అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు చల్ల శ్రవణ్, వీరయ్య, సుభాష్, వినోజ్, సురేష్, మహిళ సంఘం ప్రతినిధులు చల్ల రచన, శారదతోపాటు పలువురు పాల్గొన్నారు.

ఎంవీఎస్‌లో క్యాంపస్ సెలక్షన్స్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో ఈనెల 13న శ్రీచైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మావతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు అర్హతలు కలిగిన విద్యార్థులు సర్టిఫికెట్‌లతో కళాశాల సెమినార్ హాల్‌లో జరిగే సెలక్షన్స్‌లో పాల్గొనాలని సూచించారు.

గొర్రెలు పంపిణీ చేయండి


మాట్లాడుతున్న శాంతయ్య యాదవ్

స్టేషన్ మహబూబ్‌నగర్: గొర్రెల పంపిణీ పథకం కింద దరఖాస్తు చేసుకొన్నవారిలో చాలామందికి ఇప్పటికీ లబ్ధిచేకూరలేదని జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ చైర్మన్ శాంతయ్య యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పద్మావతీకాలనీలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ప్రాథమిక సభ్యులు (గొర్రెల కాపరుల) 16,072 మంది ఉన్నారని.. గొర్రెల యూనిట్ల కోసం డీడీలు చెల్లించగా కేవలం 1377 మందికి పంపిణీ చేశారని అన్నారు. మిగిలిన వారు ఇప్పటికీ ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి గొర్రెలను పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైస్ చైర్మన్ బాలయ్య యాదవ్, డైరెక్టర్ రాజగోపాల్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి ఆలయ పునరుద్ధరణ


పూజలు చేసిన యువకులు

జడ్చర్ల టౌన్: పోలేపల్లిలోని చెన్నకేశవ స్వామి ఆలయాన్ని రాయపల్లి, పోలేపల్లి యువకులు శుభ్రం చేశారు. శిథిలావస్థలో ఉన్న ఆలయాన్ని బాగుచేయాలని యువకులు ముందుకు వచ్చి పిచ్చిమొక్కలు తొలగించి చెత్తా చెదారం తీసివేసి ఆలయంలో మంగళహారతి ఇచ్చారు. శ్రీరామనవమిలోపు ఆలయంలో స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ చేయాలని నిర్ణయించినట్లు యువకులు ప్రశాంత్‌చారీ, సూరీగౌడ్, వెంకటేశ్, రమేష్, శంకర్‌గౌడ్, నర్సింహ్మచారిలు తెలిపారు. వీరితోపాటు శేఖర్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

వీహెచ్‌పీని పటిష్టం చేస్తాం


మాట్లాడుతున్న వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లగిశెట్టి జగదీశ్వర్


సమావేశానికి హాజరైన భక్తులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: విశ్వహిందూ పరిషత్‌ను పటిష్టం చేస్తామని వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లగిశెట్టి జగదీశ్వర్ అన్నారు. ఆదివారం శివశక్తినగర్‌లోని ప్రజ్ఞ హైస్కూల్ ఆవరణలో రామభక్తుల సమ్మేళనం, సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్య రాముల ప్రతిష్ట మహోత్సవంలో హైంధవులందరూ పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గ్రామ గ్రామాన ధార్మిక కార్యక్రమాలు ఉట్టిపడేలా రాముని విగ్రహ ప్రతిష్టకు సంబంధించి ప్రచారం చేయడం బాగుందన్నారు. గ్రామాల్లోని ప్రతి దేవాలయాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి గ్రామంలో ధర్మరక్షణ సమితి పేరుతో కమిటీలు వేసుకోవాలన్నారు. అంతకుముందు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ఆధ్వర్యంలో గడపగడపకు పంచి అక్షింతల వితరణలో పాల్గొన్న రామ భక్తుల అనుభవాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర రాష్ట్ర సంయోజకుడు గణపురం రాజేశ్వర్‌రెడ్డి, సహ కార్యదర్శి రాజేశ్వరి, పాలమూరు నగర సంయోజకుడు మద్ది యాదిరెడ్డి, విభాగ సహ కార్యదర్శి మఠం రాజయ్య, జిల్లా అధ్యక్షుడు గుద్దటి చంద్రయ్య, సహ కార్యదర్శి బుట్ట శ్రీనివాస్, ప్రాంత సహ దుర్గావాహిని సంయోజకురాలు సింధూజ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ సభను విజయవంతం చేయాలి


మూసాపేటలో వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

అడ్డాకుల: నల్లగొండలో ఈనెల 13న బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆపార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మీనర్సింహ యాదవ్ పిలుపునిచ్చారు. మూసాపేట ఆదర్శ వద్ద ఆదివారం సాయంత్రం నల్గొండ సభ గోడపత్రికలను విడుదల చేశారు. నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, నర్సిములుగౌడ్, దాసరి వెంకటేష్, రఘురాములు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి


కందూర్‌లో సీసీరోడ్ల పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేయనుందని దేవరకద్ర శాసనసభ్యుడు జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కందూర్ గ్రామంలో ఆదివారం సీసీరోడ్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. సీసీరోడ్ల పనులను నాణ్యవంతంగా చేయించాలని, సకాలంలో పనులను పూర్తి చేయాలని నాయకులకు సూచించారు. గ్రామాల్లో ప్రత్యేకాధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సారించి వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు తోట శ్రీహరి, అరవింద్‌రెడ్డి, నాగిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, రాములు, సత్తిరెడ్డి, మనోహర్ తదితరులు ఉన్నారు.

ఈత ఆరోగ్యానికి మంచిది


ఈత కొలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ క్రీడలు: ఈత కొలనులో తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ఈతలో నైపుణ్యంగల నిపుణులను అందుబాటులో ఉంచుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రైవేట్ వ్యక్తుల నిర్వహణలో చేపట్టనున్న స్థానిక మెయిన్ స్టేడియంలోని ఈత కొలను ఆదివారం ఎమ్మెల్యే యెన్నం ప్రారంభించారు. ఈతకొలను వేసవిలో చిన్నారులకు ఆటవిడుపుగా ఉంటుందని, ఈత ఆరోగ్యానికి కూడా మంచిదన్నారు. చిన్నారులు ఈత కొట్టడంతో ఎత్తు కూడా పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ఎక్కువ మంది ఈతకొట్టడం వల్ల నీళ్లు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడూ శుభ్రం చేసుకోవాలని, అనుక్షణంగా అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్నారులు ఈత కొలనులో ఉన్నప్పుడూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా మెయిన్ స్టేడియంలోని చిన్నారుల ఆటస్థలాన్ని, బాలికల హాస్టల్ భవనం, వాలీబాల్ అకాడమీ భవనం, ఇండోర్‌స్టేడియాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. డీవైఎస్‌ఓ ఎస్.శ్రీనివాస్,నాయకులు పాల్గొన్నారు.

మంచి సమాజాన్ని నిర్మాణం చేద్దాం

మంచి సమాజాన్ని నిర్మాణం చేద్దామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రం 35వ వార్డులోని న్యూమోతీనగర్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో జరిగిన సన్మానం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల వరకే పార్టీలు పరిమితం కావాలని, ఎన్నికల అనంతరం అభివృద్ధే ధ్యేయంగా అందరూ కలిసి రావాలని కోరారు. పదవులు, అధికారం అనేవి శాశ్వతం కావని, ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం పొందడమే నిజమైన పదవి అన్నారు. సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్, నాయకులు చంద్రకుమార్‌గౌడ్, బెక్కరి అనిత, సిరాజ్‌ఖాద్రీ, లక్ష్మణ్ యాదవ్, అజ్మత్‌అలీ, ప్రవీణ్‌కుమార్, శకుంతల, వెంకటలక్ష్మి, రాములు, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రం అయ్యప్పకొండ కింది భాగంలోని శ్మశానవాటికను ఎమ్మెల్యే పరిశీలించారు. సౌకర్యాలు ఏర్పాటు చేసేలా తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.